కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- మల్లాపూర్ మండలం రేగుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రేగుంటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

మల్లాపూర్, నవంబర్ 7: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల అధికారులు, నిర్వాహకులకు సూచించారు. మండలంలోని రేగుంట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్రాల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో భూమేశ్, మాజీ సర్పంచులు కుందేళ్ల నర్సయ్య, నిమ్మల భూమారెడ్డి, గణవేని మల్లేశ్‌యాదవ్, సురకంటి తిరుపతిరెడ్డి, సార్ల జితేందర్‌రెడ్డి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమానికే కులగణన

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, నవంబర్ 7: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం కులగణన కార్యక్రమాన్ని చేపట్టిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ఆయన 29 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు, 19 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, కలికోట సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కోసం 521 ఎకరాల భూసేకరణకు రైతులు సహకరించాలన్నారు. త్వరలోనే రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అనంతరం చింతకుంట గ్రామంలో గాజ ఆజిరెడ్డి మృతిచెందగా, ఆయన మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను విప్ పరామర్శించారు. కార్యక్రమంలో ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వినోద్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు తొట్ల అంజయ్య, గంగాధర్, ఎండీ హఫీజ్, ముంజ నందం గౌడ్, పూండ్ర నారాయణరెడ్డి, పులి హరిప్రసాద్, ధనుంజయ్‌రెడ్డి, కుంభం మహేశ్, వంగ మహేశ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలపై పన్ను మాఫీ చేయాలి

మల్లాపూర్, నవంబర్ 7: గ్రామాల్లోని చెరువులు, కుంటలపై ప్రభుత్వానికి మత్స్య సహకార సంఘాలు చెల్లిస్తున్న పన్ను మాఫీ చేయాలని మత్స్య సహకార సంఘాల జిల్లా డైరెక్టర్ తోకల రాజు కోరారు. మొగిలిపేట గ్రామంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో శివకుమార్, రాము, నర్సయ్య, గణేశ్, రమేశ్, భాస్కర్, మాణిక్యం, శ్రీనివాస్, భూమయ్య, శివయ్య, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నర్సన్న సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, నవంబర్ 7: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు గోదావరి నదిలో స్నానాలాచరించి కార్తీక దీపాలను వదిలారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి, బ్రాహ్మణులకు దీపదానాలు చేశారు. భక్తులకు సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల, నవంబర్ 7: 2024 సంవత్సరంలో ఓటు ప్రాధాన్యత, వినియోగించుకోవడంపై ప్రజలను చైతన్యవంతం చేసిన మీడియా సంస్థలకు భారత ఎన్నికల సంఘం జనవరి 25న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, రేడియో, సోషల్ మీడియాకు ఒక్కొక్కటి చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల మీడియా సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రచార నాణ్యత, ఖచ్చితత్వం, ప్రజా పరిజ్ఞానం, ఓటర్లకు సరైన సమాచారాన్ని అందించడం, ప్రత్యేక కథనాలు, చర్చలు వంటి అంశాల ఆధారంగా ఈ అవార్డులను ప్రకటిస్తారని తెలిపారు. మీడియా సంస్థలు తమ ప్రచారం యొక్క సారాంశం, వార్త, ఇతర ప్రచార కార్యకలాపాలతో సహా నిజ ప్రతులను సమర్పించాలని పేర్కొన్నారు. డిసెంబర్ 10లోగా తమ సిఫార్సును రాజేశ్‌కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోక్ రోడ్, న్యూ ఢిల్లీ (110001) చిరునామాకు పంపాలని వెల్లడించారు. ఈమెయిల్‌లో media-division@eci.gov.inకు పంపవచ్చని, హిందీ, ఇంగ్లిష్ కాకుండా ఇతర భాషల్లో ఉన్నట్లయితే ఆంగ్ల అనువాదం కూడా జత పరచాలని తెలిపారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

మేడిపల్లి, నవంబర్ 7: మేడిపల్లి మండలం కాచారం గ్రామానికి చెందిన న్యాత అక్షయ ఆసిఫాబాద్‌లో బీఎస్సీ నర్సింగ్ సీటు సాధించింది. అడ్మిషన్ ఫీజు కోసం కాంగ్రెస్ భీమారం, మేడిపల్లి మండలాధ్యక్షులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి రూ. 6 వేలు, ఏనుగు రమేశ్‌రెడ్డి రూ. 5 వేలు, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, మన్నెగూడెం మాజీ సర్పంచ్ తేలు నరేశ్ రూ. 5 వేల చొప్పున గురువారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిట్యాల సురేశ్, నాయకులు దేశెట్టి గంగాధర్, రెడ్డి, అనుదీప్, సయ్యద్, లాజర్, జలంధర్, అజయ్, హరీశ్, రాజేందర్, రాజేశ్, అరుణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొలంబాట కార్యక్రమంపై అవగాహన

జగిత్యాల రూరల్, నవంబర్ 7: మండలంలోని మోరపల్లి గ్రామంలో గురువారం విద్యుత్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రైతులకు విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏడీ జవహర్ నాయక్, ప్యాక్స్ చైర్మన్ మైపాల్ రెడ్డి, ఏఈ శ్రీధర్, లైన్‌మెన్ తిరుపతి, హెల్పర్ శ్రీనివాస్, రైతు నాయకులు రాజిరెడ్డి, రాములు, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

జగిత్యాల రూరల్, నవంబర్ 7: ఆరోగ్య పరిరక్షణతోనే విద్యలో రాణించవచ్చని ఐఎంఏ పట్టణాధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కండ్లపల్లిలోని మోడల్ స్కూల్‌లో గురువారం ఐఎంఏ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 488 మంది బాలికలకు వైద్యులు అనీమియా పరీక్షలు చేశారు. 131 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులు ఒడ్నాల రజిత, గూడూరి శ్రీలత, అంకం అరుణ, సాయికిరణ్, కల్లెం దీపక్ రెడ్డి, అర్జున్, ప్రిన్సిపాల్ సరితా దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల రూరల్, నవంబర్ 7: చిల్వకోడూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాలతి, జాహ్నవి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీబాయ్, పీడీ భాస్కర్ రెడ్డి తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

జగిత్యాల రూరల్, నవంబర్ 7: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. ఈ క్రీడల్లో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో జగన్మోహన్ రెడ్డి, జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీరామ్ నాయక్, ప్రిన్సిపాల్ అశోక్, పేట అధ్యక్షుడు విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు భాస్కర్, అఫ్సర్, కృష్ణప్రసాద్, అజయ్, డేవిడ్‌సన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



వాకర్స్‌తో మాట్లాడుతున్న యాదగిరి శేఖర్ రావు

జగిత్యాల, నవంబర్ 7: మీకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను ఆదరించాలని ట్రస్మా రాష్ట్ర నాయకుడు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్, వివేకానంద మినీ స్టేడియం, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా శేఖర్ రావు మాట్లాడుతూ, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఒక మిస్డ్‌కాల్‌తో మీ సమస్యను పరిష్కరిస్తానన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బోయినపల్లి శ్రీధర్ రావు, నాయకులు రవిప్రసాద్, జగన్మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాంబాబు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రామచంద్రా రావు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం, నవంబర్ 7: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరధిలోని బండలింగాపూర్ శివారులో జాతీయ రహదారి పక్కనున్న ఓ వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ అనిల్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బండలింగాపూర్‌కు చెందిన కొలి సాగర్ వ్యవసాయ బావిలో 30 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి మృతదేహం తేలినట్లు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండగా, బావిలోంచి తీసి, అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి భూమేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఒంటిపై బూడిద రంగు టీషర్టు, నలుపు రంగు జీన్‌ప్యాంటు, బ్రౌన్ బెల్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికులకు గాయాలు

దవాఖానలో పారిశుధ్య కార్మికురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల, నవంబర్ 7: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికులకు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానిక కొత్త బస్టాండ్ నుంచి చెత్త సేకరణ కోసం నంది చౌరస్తా వైపు వెళ్తున్న మున్సిపల్ ట్రాక్టర్‌ను బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో పారిశుధ్య కార్మికులు కార్తీక్, రాధ, సుగుణ, తార, గంగు, రేణుకకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించి, ప్రథమ చికిత్స అందించారు. అనంతం మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి దగ్గరుండి వైద్య సేవలందేలా చూశారు. పారిశుధ్య కార్మికులు క్షేమంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. కాగా, జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు దారిశెట్టి రాజేశ్, సజ్జు, ఫహీం, సత్యం తదితరులున్నారు. అలాగే, పారిశుధ్య కార్మికుల యోగక్షేమాలపై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆరా తీశారు.

దూలూర్‌లో యాదవుల సామాజిక బహిష్కరణ

కథలాపూర్, నవంబర్ 7: కథలాపూర్ మండలం దూలూర్ గ్రామంలో యాదవ కులస్తులను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సామాజిక బహిష్కరణ చేసిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు దూలూర్ గ్రామ యాదవ సంఘం సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తహసీల్దార్ వినోద్‌కు విపతిప్రతం ఇచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. వారి కథనం ప్రకారం.. దూలూర్ గ్రామ శివారులోని వరద కాలువ మట్టి అక్రమంగా తవ్వడంతో పాటు తరలింపు విషయంలో వివాదం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులను ప్రశ్నించినందుకు తమను సామాజిక బహిష్కరణ చేశారని యాదవ సంఘం సభ్యులు విప్, తహసీల్దార్‌కు వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అక్రమ మట్టి తరలింపు, ఇసుక వ్యాపారం వ్యవహారంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతోనే వివాదాలకు కారణమవుతున్నాయని పలువురు మండిపడుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సారంగాపూర్, నవంబర్ 7: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీబీ డైరెక్టర్, బీర్‌పూర్ సింగిల్ విండో చైర్మన్ ముప్పాల రాంచందర్ రావు, తహసీల్దార్ ముంతా జొద్దీన్ కోరారు. బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో తుంగూర్, చర్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో విండో మాజీ అధ్యక్షుడు మెరుగు రాజేశం, పాలకవర్గ సభ్యులు మందాటి సాగర్, వంగపెల్లి కృష్ణారావు, మాజీ సర్పంచ్ గుడిసే జితేందర్ యాదవ్, ఏఈవో వినోద్, సీఈవో తిరుపతి పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 6: సత్తక్కపల్లి, మేడిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ ప్రారంభించారు. ఏపీఎం విమోచన, సీసీ పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, నవంబర్ 7: మండలంలోని యామాపూర్, ఫకీర్‌కొండాపుర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ బోర్గం రాజు, డీఆర్డీవో రఘువరన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం శంకర్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, గంగాధర్, వెంకట్‌రెడ్డి, గంగారెడ్డి, శేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు నిధుల మంజూరు

పెగడపల్లి, నవంబర్ 7: మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి కస్తూర్బా వరకు రోడ్డు నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ తెలిపారు. కాగా, గురువారం రోడ్డును పరిశీలించినట్లు వివరించారు. పార్టీ నాయకులు మల్లారెడ్డి, తిరుపతి, చాట్ల ప్రశాంత్, రాజు, శ్రీనివాస్, చెట్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి హారతి

ధర్మపురి, నవంబర్ 7: కార్తీక మాసం ఆరో రోజు గురువారం గోదావరి నదికి హారతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి మేళతాళాల మధ్య గోదావరి నది వరకు పండితులు, అర్చకులు, భక్తులు హరినామస్మరణ సంకీర్తనల మధ్య శోభాయాత్రగా చేరుకున్నారు. గోదావరి పుష్కర ఘాట్లపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద పండితులు మంత్రోచ్ఛరణలతో గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి గోదావరి నదికి హారతి ఇచ్చారు. నదిలో కార్తీక దీపాలను వదిలి భక్తి ప్రవత్తులను చాటుకున్నారు. కార్యక్రమంలో వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఆదరించాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కోరుట్ల, నవంబర్ 7: పట్టభద్రులు తనను ఆదరించి, సేవే చేసే అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల ద్వారా తక్కువ ఫీజుతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగ, నిరుద్యోగ యువత, ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బరిలో నిలుస్తున్న తనను ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాయికల్, నవంబర్ 7: రామాజీపేట గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుడు చెరుకు రాజేశ్వర శర్మ పర్యవేక్షణలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో వేద పండితులు రాంగోపాల్ ఆచార్యులు, జగన్నాథ ఆచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ రాజు, మాజీ సర్పంచ్ రవి, ఉపసర్పంచ్ హరీశ్ రావు, మాజీ ఎంపీటీసీ మోహన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

రాయికల్, నవంబర్ 7: ఒడ్డెలింగాపూర్‌కు చెందిన పాలకుర్తి అశోక్ ఇటీవల అనారోగ్యంతో గల్ఫ్‌లో మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 7: ఎరువులు, విత్తనాల దుకాణాల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి రామచందర్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, బిల్ బుక్కులను పరిశీలిచారు. స్టాక్ రిజిష్టర్లలో ఎప్పటికప్పుడు వివరాలను నమోదు చేయాలని సూచించారు. అలాగే, జగ్గసాగర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు మాజీ మంత్రి పరామర్శ

పద్మను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్, నవంబర్ 7: ఎండపల్లి మండలం అంబారిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త అల్లంల పద్మ అనారోగ్యంతో బాధపడుతూ దవాఖానలో చికిత్స పొంది ఇంటికి వచ్చింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం వెళ్లి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు సింహాచలం జగన్, ఏలేటి కృష్ణారెడ్డి, గాజుల మల్లేశం, ఏలేటి చంద్రారెడ్డి, శ్రీపతిరావు, కృష్ణ, జానీ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

మల్యాల(కొడిమ్యాల), నవంబర్ 7: కొడిమ్యాల మండల కేంద్రంతో పాటు రామకిష్టాపూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం పరిశీలించారు. కేంద్రాల్లో ధాన్యం నిల్వలు, తూకం వేసిన ధాన్యం వివరాలు, గన్నీ సంచులు, తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు రాజనర్సింగరావు, చిలువేరి నారాయణ గౌడ్, బత్తిని శ్రీనివాస్, గడ్డ జీవన్‌రెడ్డి, పిడుగు ప్రభాకర్‌రెడ్డి, కడారి మల్లేశం, రాఘవరెడ్డి, ప్రసాద్ తదితరులున్నారు.

పంచాయతీ ట్రాక్టర్లకు జియో ట్యాగింగ్

పెగడపల్లి, నవంబర్ 7: మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు చెందిన ట్రాక్టర్లకు గురువారం జియో ట్యాగింగ్ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ తెలిపారు. కార్యదర్శులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డా.. చెగ్యాం అంగన్‌వాడీ కేంద్రం

వెల్గటూర్, నవంబర్ 7 : వెల్గటూర్ మండలంలోని చెగ్యాం గ్రామంలోని అంగన్‌వాడి – 1వ కేంద్రం మందు బాబులకు అడ్డాగా మారింది. గత కొన్ని రోజుల నుంచి సెంటర్ ఎదుట గుర్తు తెలియని మందు బాబులు తాగి ఖాళీ సీసాలు అలాగే వదిలి వెళ్తున్నారు. సెంటర్‌కు ఆయా లేకపోవడం, గ్రామ పాలక వర్గాలు లేక ఎవరికి చెప్పుకోవాలో తెలియక తామే శుభ్రం చేసుకుంటున్నామని అంగన్‌వాడీ టీచర్ రమాదేవి వాపోతున్నారు. వెంటనే సెంటర్‌పై అధికారులు దృష్టిసారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జగిత్యాల రూరల్, నవంబర్ 7: డబుల్ బెడ్రూం ఇండ్లల్లో సదుపాయాల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. అంతర్గాంలోని డబుల్ బెడ్రూం ఇండ్లల్లో చేపడుతున్న కరెంట్, తాగునీరు, డ్రైనేజీ, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డీఈ మిలింద్, ఏఈ రాజమల్లయ్య, నాయకులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

పెగడపల్లి, నవంబర్ 7: పెగడపల్లి పోలీస్ స్టేషన్‌ను గురువారం డీఎస్పీ రఘుచందర్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన పలు ఫైళ్ల పరిశీలన చేయడంతో పాటు మండలంలో శాంతి భద్రతలు, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మల్యాల సీఐ నీలం రవి, ఎస్ఐ రవికిరణ్, సిబ్బంది రవి, సంపత్‌గౌడ్, ఎల్లయ్య, వెంకటరెడ్డి, రవీందర్, తిరుపతి, మమత, రమ, రాజు తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం వచ్చాకే ధాన్యం తూకం వేయాలి

పెగడపల్లి, నవంబర్ 7: కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం వచ్చిన ధాన్యమే తూకం వేసి మిల్లులకు పంపించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత స్పష్టం చేశారు. పెగడపల్లి మండలం దేవికొండ గ్రామంలో నంచర్ల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, సంఘం చైర్మన్ మంత్రి వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే, నంచర్ల, రాములపల్లి, రాంనగర్‌లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఆయా చోట్ల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, నాణ్యమైన ధాన్యంలో కోతలు విధించే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, సహకార అధికారి మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి, నవంబర్ 7: గొల్లపల్లి మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ లత సిబ్బందిని ఆదేశించారు. మార్కెట్ యార్డును గురువారం ఆమె సందర్శించారు. మిల్లు అలాట్ చేసి రేపటి నుంచి కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు.

వికటించిన కుట్లు.. బాలింతకు అవస్థ!

మెట్‌పల్లి, నవంబర్ 7: మెట్‌పల్లి మండలం మేడిపల్లికి చెందిన ఓ గర్భిణి ప్రసూతి కోసం గత నెల 24న పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో చేరింది. మొదటి కాన్పు శస్త్రచికిత్స కావడంతో, రెండో కాన్పు కూడా శస్త్రచికిత్స చేయాలని వైద్యురాలు తెలిపింది. మరుసటి రోజు శస్త్రచికిత్స చేయగా ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అదే నెల 30న దవాఖాన నుంచి డిశ్చార్జి అయ